Mahadev
"INFRA DEVELOPERS"
Your Invest today Foundation for tomorrow

ప్రతినెల..మనకోసం..మనపత్రిక

# వేద ప్రకాష్ టైమ్స్

తెలుగు దిన పత్రిక
నిజమే మా ఆయుధం
Vist us @ www.prakashtimes.com
VEDA PRAKASH TIMES

రిపోర్టరు కావలెను
ప్రకాష్ టైమ్స్ దినపత్రికలో
పని చేయుటకు రెండు తెలుగు
రాష్ట్రాల నుండి రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
8688262225

Published From : Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool

| నల్గొండ | గురువారం | 13.08.2026 | సంపుటి: 07 | సంచిక: 178 | 4 పేజీలు | వెల : రూ.2.0 |
|---|---|---|---|---|---|---|
| Nalgonda | Thursday | | Vol : 07 | Issue No : 178 | Pages : 04 | Price : Rs.2.00 |

# ఆత్మకధలు చదవండి..

## రీల్స్ సంస్కృతిపై ప్రధాని మోదీ హెచ్చరిక



**ఢిల్లీ: ప్రకాష్ టైమ్స్ :**
సోషల్ మీడియా యుగంలో యువత పుస్తక పఠన అలవాటును కోల్పోకూడదని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రీల్స్, సోషల్ మీడియా పెంచుతున్న "షార్ట్‌కట్ సంస్కృతి" పట్ల హెచ్చరించారు. నేటి డిజిటల్ యుగంలో సెకన్ల వ్యవధిలో మారే రీల్స్‌పై దృష్టి పెట్టడం వల్ల యువతలో ఏకాగ్రత, లోతైన ఆలోచనా శక్తి తగ్గిపోతోందని, జీవితంలో నిజమైన పాఠాలు నేర్చుకోవడానికి ఆత్మకథలు చదవడం ఎంతగానో తోడ్పడుతుందని మోడీ పేర్కొన్నారు. మహనీయుల, ప్రముఖుల జీవిత చరిత్రలు, ఆత్మకథలు చదవడం ద్వారా వారు ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాల నుంచి ఎంతో నేర్చుకోవచ్చని ప్రధాని వివరించారు. పుస్తక పఠనం వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడమే కాకుండా, సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. డిజిటల్ వినోదానికి పరిమితం కాకుండా యువత పుస్తకాలను చదివే అలవాటును నిరంతరం కొనసాగించాలని, ముఖ్యంగా దేశానికి సేవ చేసిన వారి అనుభవాలను చదివి స్ఫూర్తి పొందాలని ఈ సందర్భంగా ప్రధాని మోడీ కోరారు.

# ఆర్మీ ఉద్యోగాలకు తెలంగాణ యువతను సిద్ధం చేస్తాం

## లెఫ్టినెంట్ జనరల్‌తో సీఎం రేవంత్



**ప్రకాష్ టైమ్స్ :హైదరాబాద్ :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్–చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనిపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపైనా సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తామని లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీసీ మహిళలకు బంపరాఫర్.. శుభవార్త చెప్పిన మంత్రి పొన్నం



**ప్రకాష్ టైమ్స్ :హైదరాబాద్ :**
రాష్ట్రంలోని బీసీ మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టబోతోంది. వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు ఉచితంగా ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని నేడు అధికారికంగా ప్రారంభించబోతున్నట్లుగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

### నియోజకవర్గానికి 1,000 కుట్టు మిషన్లు..

స్వయం ఉపాధి ద్వారా మహిళలు సొంత కాళ్లపై నిలబడాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 1,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్ల చొప్పున అర్హులైన మహిళలకు ఉచితంగా అందజేయనున్నారు. సాధారణ కుట్టు మిషన్లకు భిన్నంగా మహిళల శ్రమ తగ్గేలా, వేగంగా పనిచేసుకునేలా అధునాతన ఆటోమేటిక్ మిషన్లను ప్రభుత్వం అందించనుంది. ఈ పథకం ద్వారా వేలాది మంది బీసీ మహిళలు ఇళ్ల వద్ద నుంచే టైలరింగ్‌తో స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశం లభిస్తుంది. అయితే, ఈ పథకానికి సంబంధించి లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారు.. దరఖాస్తు విధానం ఏమిటి? అనే వివరాలపై స్పష్టతనిస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయనుంది. అదేవిధంగా లబ్ధిదారులకు ఉండాల్సిన వయోపరిమితి, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల అవసరం వంటి అంశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ నేడు అధికారికంగా ప్రకటించనున్నారు. ఆన్‌లైన్, మీ–సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించే తేదీలను, ప్రక్రియను సమగ్రంగా వెల్లడించనున్నారు.

# మేడిగడ్డ బ్యారేజీ కేసులో కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు



**ప్రకాష్ టైమ్స్ : హైదరాబాద్ :**
కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు సంబంధించిన కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ మొత్తం వ్యవహారంలో తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది. గతంలో పంపిన నోటీసులు ఆయనకు అందలేదని తేలడంతో మళ్లీ నోటీసులు పంపాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

### కోర్టు కీలక ఆదేశాలు..

మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు పక్కాగా జారీ చేయాలని జిల్లా న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను జిల్లా కోర్టు సెప్టెంబర్ 9వ తేదీకి వాయిదా వేసింది. కాగా, మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో అక్రమాలు, నాణ్యతా లోపాలపై గతంలో రాజలింగమూర్తి అనే వ్యక్తి కోర్టులో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటిషనర్ మృతి చెందినప్పటికీ, కేసు విచారణను ఆపకుండా కొనసాగించాలని గతంలో తెలంగాణ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. మేడిగడ్డ పిల్లర్లు కుంగిన ఘటనపై నమోదైన ఈ పిటిషన్‌పై భూపాలపల్లి జిల్లా కోర్టులో విచారణ సాగుతుండటం, కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు జారీ కావడం స్టేట్ పాలిటిక్స్‌లో ఆసక్తికరంగా మారింది.

# లోక్‌సభ స్పీకర్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేఖ



**ఢిల్లీ :ప్రకాష్ టైమ్స్ :**
దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పరీక్ష వివాదం, అనంతర విద్యార్థుల ఆందోళనలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఆయన ఒక అధికారిక లేఖ రాశారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రభుత్వం తరఫున నీట్ అంశంపై చర్చకు అంగీకారం తెలిపారని అమిత్ షా తన లేఖలో గుర్తుచేశారు. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని తీవ్రంగా ఎత్తిచూపడానికి ముందే, ప్రస్తుత సమావేశాల్లోనే 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు, 2026' పై సుదీర్ఘ చర్చ జరిగిందని లేఖలో హోం మంత్రి ప్రస్తావించారు. అయితే ఆ సమయంలో ప్రతిపక్షానికి చెందిన ఏ ఎంపీ కూడా నీట్ పరీక్షల గురించి మాట్లాడలేదని, (మిగతా 2 లో..)

# 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్' చెల్లదు: ఎన్నికల సంఘం




**ప్రకాష్ టైమ్స్ :హైదరాబాద్ :**
తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కొత్తగా జారీ చేస్తున్న 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ల' చెల్లుబాటుపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం జులై 25న జారీ చేసిన జీఓ నంబర్ 172 ప్రకారం 'మీసేవ' ద్వారా ఇచ్చే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను ఓటరు నమోదు, పరిశీలన ప్రక్రియలో ఆమోదించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఈసీ కార్యదర్శి నవీన్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అధికారిక లేఖ రాశారు.

### రేషన్ కార్డుతో సమానమే..

గతంలో తహశీల్దార్లు క్షేత్రస్థాయి విచారణ, పత్రాల తనిఖీ చేపట్టిన తర్వాతే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను జారీ చేసేవారని ఈసీ పేర్కొంది. కానీ, జీఓ 172 ప్రకారం ఎలాంటి ముందస్తు విచారణ లేకుండా, (మిగతా 2 లో..)

# త్వరలో జంతర్ మంతర్ సీజన్-2 రాబోతుంది

### అభిజీత్ దీప్కే సంచలన ప్రకటన



**ఢిల్లీ: ప్రకాష్ టైమ్స్ :**
కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే సంచలన ప్రకటన చేశారు. రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా త్వరలోనే 'జంతర్ మంతర్ సీజన్–2' పేరిట సరికొత్త పోరాటాన్ని మొదలుపెట్టనున్నట్లుగా ఆయన తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో యూజర్లు అడుగుతున్న ప్రశ్నలకు స్పందిస్తూ అభిజీత్ దిప్కే ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా దీప్కే మాట్లాడుతూ.. జంతర్ మంతర్ సీజన్ 2 ఎప్పుడు ప్రారంభమవుతుందని చాలామంది ఇన్‌స్టాగ్రామ్‌లో కామెంట్లు చేస్తున్నారని అన్నారు. వారందరికీ నేను చెప్పేది ఒక్కటే.. అతి త్వరలోనే సీజన్ 2 ప్రారంభం కాబోతోందని స్పష్టం చేశారు. అయితే, రెండో విడత నిరసనల తేదీలు, ప్రధాన డిమాండ్లు, పూర్తి ప్రణాళికలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని పేర్కొన్నారు.

### పాఠశాల విద్యార్థుల నిరసనలకు మద్దతు..

ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్ జిల్లా కలెక్టరేట్ వద్ద తమ పాఠశాలకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ దాదాపు 300 మంది విద్యార్థులు, 100 మంది తల్లిదండ్రులు చేపట్టిన నిరసన మార్చ్‌కు అభిజీత్ దిప్కే పూర్తి మద్దతు తెలిపారు. దశాబ్దాల క్రితమే పరిష్కారమవ్వాల్సిన కనీస మౌలిక వసతుల కోసం నేడు చిన్నారులు రోడ్డెక్కాల్సి రావడం బాధాకరమని కామెంట్ చేశారు.

### సభలు నిర్వహించకుండా బీజేపీ ఒత్తిళ్లు

ఇక రాజధాని ఢిల్లీలో తమ పార్టీ వాలంటీర్ల సమావేశాన్ని అడ్డుకోవడానికి అధికార భారతీయ జనతా పార్టీ తీవ్ర ప్రయత్నాలు చేసిందని అభిజీత్ దిప్కే ఆరోపించారు. సమావేశం కోసం హాల్స్ బుక్ చేసుకోకుండా హాల్ యజమానులపై పైనుంచి తీవ్ర ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. చివరికి ఒక హాల్ లభించినప్పటికీ, సమావేశం జరిగే రోజు ఉదయం హాల్ నిర్వాహకులకు బెదిరింపులు వచ్చాయని ఆరోపించారు.

# జలసిరికి జాప్యం.. కలెక్టర్ ఆగ్రహం

## పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు

## నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు





ప్రకాష్ టైమ్స్ : సిద్ధిపేట:

వర్షాభావ పరిస్థితులు పొంచి ఉన్న వేళ జిల్లాలో జలసిరి కార్యక్రమం అమలులో జాప్యం జరగడంపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జలసిరి పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓను ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జలసిరి కార్యక్రమంతో పాటు జిల్లాలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని కలెక్టర్ సమీక్షించారు. ఆయా శాఖల వారీగా పనుల పురోగతి, లక్ష్యాలు, ఎదురవుతున్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలసిరి కార్యక్రమం అమలులో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై అధికారులను ప్రశ్నించారు.

### రైతులకు నీటి భద్రతే లక్ష్యం

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జలసిరి కింద చేపడుతున్న ఫార్మ్ పాండ్‌లు, కమ్యూనిటీ పాండ్‌ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నిర్మాణాలు పూర్తయితే వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపుతో పాటు రైతులకు సాగునీటి భద్రత కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు జలసిరి కార్యక్రమం ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో రైతులను భాగస్వాములను చేస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాపై బాధ్యతతో పనిచేసి ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### ప్రభుత్వ భవనాలపై వర్షపు నీటి సంరక్షణ

జిల్లాలోని అన్ని ప్రభుత్వ భవనాలపై రూఫ్‌టాప్ రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు ఏర్పాటు చేయడాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా ఒడిసిపట్టి భవిష్యత్ అవసరాలకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓలు ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు.

### వనమహోత్సవానికి వారం గడువు

వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో చేపడుతున్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ గడువు విధించారు. రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రస్తుతం అనుకూలంగా ఉన్న వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుని మొక్కల నాటడం పూర్తి చేయాలని ఆదేశించారు.

### ఇందిరమ్మ ఇళ్లపై ప్రత్యేక దృష్టి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ఫొటో అప్‌లోడ్ ప్రక్రియను గురువారం నాటికి వందశాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో కనీసం ఒక కమ్యూనిటీ సోక్‌పిట్ ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీల్లో డంపింగ్ షెడ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

### భూ సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కారం

అభివృద్ధి పనులకు భూ సమస్యలు అడ్డంకిగా మారితే వాటిని పెండింగ్‌లో ఉంచకుండా స్థానిక తహసీల్దార్లతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సమస్యలను పరిష్కరించుకున్న వెంటనే పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు.

### 17 వేల దరఖాస్తులపై నిర్ణయం

చేయూత పథకం కింద పెన్షన్ల మంజూరు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో సుమారు 17 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో అర్హులైన దరఖాస్తులను వెంటనే పరిశీలించి అప్‌లోడ్ చేయాలని సూచించారు.

### క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలి

అభివృద్ధి పనులు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎంపీడీఓలు తమ పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బందితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయకపోతే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జలసిరి, వర్షపు నీటి సంరక్షణ, పచ్చదనం, పారిశుద్ధ్యం, ఇందిరమ్మ ఇళ్లు, సామాజిక భద్రత వంటి అంశాలపై అధికారులు సమన్వయంతో పనిచేస్తే జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలపవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జిల్లా పరిషత్ సీఈఓ రమేష్, ఎంపీడీఓలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




ప్రకాష్ టైమ్స్ : సిద్ధిపేట:

యువత చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. రవికుమార్ సూచించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జి. సుదర్శన్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిద్ధిపేటలోని మెరిడియన్ స్కూల్‌లో బుధవారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎం. రవికుమార్ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముకలాంటిదని అన్నారు. యువతలోని ప్రతిభ, ధైర్యం, క్రమశిక్షణను సద్వినియోగం చేసుకుంటే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలను అలవర్చుకోవాలని, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను తెలుసుకుని నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువత మంచి పౌరులుగా ఎదగడం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్ రెడ్డి, అడ్వకేట్ ఎన్. నవీన్ కుమార్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తంగళ్లపల్లి మైనార్టీ పాఠశాలలో ఘనంగా స్టూడెంట్స్ కౌన్సిల్ ఎలక్షన్స్

## మైనార్టీలో మోగిన ఎన్నికల గంటబాలికల కౌన్సిల్ ఎన్నికలకు భారీ స్పందన

## ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలే లక్ష్యం ప్రిన్సిపల్ -ఉరుస ఫాతిమా



ప్రకాష్ టైమ్స్ :తంగళ్లపల్లి:

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని మైనార్టీ బాలికల పాఠశాల, కళాశాలలో స్టూడెంట్స్ కౌన్సిల్ ఎలక్షన్స్ ఘనంగా నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల తరహాలో ఓటింగ్ ప్రక్రియ చేపట్టి విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావనను పెంపొందించారు. ఎన్నికల్లో భాగంగా విద్యార్థి అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో క్యాంపస్‌లో ఎన్నికల సందడి నెలకొంది. విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొని తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటు వేశారు. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి కెప్టెన్ వైస్ కెప్టెన్ సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఉరుస ఫాతిమా మాట్లాడుతూ. విద్యార్థులకు చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో స్టూడెంట్స్ కౌన్సిల్ ఎలక్షన్స్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రత్యక్షంగా పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, నిర్ణయ సామర్థ్యం, సమన్వయ భావన పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులను కేవలం విద్యకే పరిమితం కాకుండా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ప్రిన్సిపల్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించారు.




# లోక్‌సభ స్పీకర్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేఖ

(మొదటి పేజీ తరువాయి)

అయినప్పటికీ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మరొకసారి ఈ అంశంపై చర్చించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు.'నా విజ్ఞప్తి ఏమిటంటే... మీరు విపక్షాలతో చర్చించి, పరస్పర అంగీకారంతో నేటి నుంచి ఎంత సమయం, ఎన్ని గంటలు సరిపోతాయని భావిస్తే అంత సమయం కేటాయించాల్సిందిగా కోరుతున్నాను. కేటాయించిన ఆ సమయంలో నేను సభలో స్వయంగా ఉండి, ఈ అంశంపై చర్చలో పాల్గొనడానికి, విపక్షాల ప్రశ్నలన్నింటికీ సమాధానమివ్వడానికి సిద్ధంగా ఉన్నాను.' అని అమిత్ షా తన లేఖలో పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో చర్చలు, సంభాషణల ద్వారానే పరిష్కారాలు లభిస్తాయి.. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య వ్యవస్థలపై తనకు అపారమైన విశ్వాసం ఉంది.. అలాగే ఈ సభ చర్చలు, సంభాషణల కోసమే ఉందనేది నా నమ్మకమని అమిత్ షా తన లేఖలో రాశారు. కాబట్టి, విపక్ష నాయకులతో చర్చించి, ఈ ముఖ్యమైన విషయంపై మంచి వాతావరణంలో చర్చ జరిగేలా చూడాలని కోరుతున్నానని అమిత్ షా పేర్కొన్నారు. తద్వారా ఈ అంశంపై అధికార, ప్రతిపక్షాలకు చెందిన గౌరవనీయ సభ్యులందరూ తమ అమూల్యమైన అభిప్రాయాలను, ఆలోచనలను సభకు సమర్పించే అవకాశం కలుగుతుందని అమిత్ షా చెప్పారు.

# 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్' చెల్లదు: ఎన్నికల సంఘం

(మొదటి పేజీ తరువాయి)

కేవలం రేషన్ కార్డు డేటా ఆధారంగా ఆన్‌లైన్‌లో రెండు రోజుల్లోనే ఈ సర్టిఫికెట్లు ఇస్తున్నారని గుర్తుచేసింది. ఫలితంగా ఈ కొత్త సర్టిఫికెట్ కేవలం 'రేషన్ కార్డు'తో సమానమని వివరించింది. రేషన్ కార్డులు పౌరసత్వానికి నిశ్చయాత్మక ఆధారం కావని, ఓటరు జాబితా తనిఖీకి వాటిని ప్రామాణిక పత్రంగా పరిగణించలేమని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈసీ లేఖలో ఉటంకించింది. అందువల్ల కొత్త జీఓ కింద ఇచ్చే ఫ్యామిలీ సర్టిఫికెట్లను గుర్తింపు పత్రాలుగా స్వీకరించలేమని తెలిపింది. అయితే, జీఓ 172 రాకముందు (జులై 25, 2026 కంటే ముందు) పాత విధానం ప్రకారం తహశీల్దార్ల విచారణ ద్వారా పొందిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను మాత్రం సర్ పరిశీలన ప్రక్రియలో ఆమోదిస్తామని లేఖలో స్పష్టం చేసింది.

# ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య

## ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ సాయి కుటుంబాన్ని ఆదుకుంటాం..

## కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తాం...

## రూ.22లక్షల పరిహారం.. తక్షణ సాయం కింద రూ.10లక్షలు అందజేస్తాం...

## ఇందిరమ్మ ఇల్లుతో పాటు తండ్రికి పెన్షన్ సౌకర్యం...

## ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి హామీ...

## ఎల్బీనగర్ పీఎస్ వద్ద కుటుంబసభ్యులకు, బంధువులకు ఎమ్మెల్యే భరోసా...

## విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన...




ప్రకాష్ టైమ్స్ ::ఎల్బీనగర్:

ఎన్నో కలలతో ఉద్యోగంలో చేరి, అర్థాంతరంగా తనువు చాలించిన బండాలేమూర్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ సాయి ఆత్మహత్య ఘటనపై ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన కుటుంబసభ్యులు, బంధువులతో మాట్లాడిన ఆయన... దుర్ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. విధి నిర్వహణలో సాయిని ఇబ్బందికి గురిచేశారన్న ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి, బాధ్యులపై కఠినహాహాచర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులకు మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. ఈ మేరకు మల్కాజ్ గిరి సీపీ, డీసీపీతో మాట్లాడారు. సాయి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్న ఎమ్మెల్యే... ప్రత్యేక చొరవతో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించేలా కృషి చేస్తామని తెలిపారు. అలాగే, రూ. 22లక్షలను ప్రభుత్వం నుంచి అందజేయనున్నట్లు ప్రకటించిన ఆయన... తక్షణ సాయం కింద రూ. 10లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. తన నియోజకవర్గానికి చెందిన సాయి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరుతో పాటు తండ్రికి పెన్షన్ వచ్చేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఉద్యోగులకు ఉన్న కోటి రూపాయల బీమా సాధ్యపడే అవకాశం లేకపోవచ్చన్న మల్ రెడ్డి... దీనిపై సీఎంతో ప్రత్యేకంగా మాట్లాడతానన్నారు. మల్ రెడ్డి రంగారెడ్డి మరియు ఉన్నతాధికారుల హామీ మేరకు కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు.

ప్రకాష్ టైమ్స్
తెలుగు దినపత్రిక
నిజమే మా ఆయుధం



# అనుభవపూర్వక అభ్యాసానికి గీతం పెద్దపీట

## ఆటోడెస్క్ ఫ్యూజన్ ఇన్‌సైడర్ కార్యక్రమం.. చురుకుగా పాల్గొన్న విద్యార్థులు






ప్రకాష్ టైమ్స్ /హైదరాబాద్: హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విద్యార్థులకు పరిశ్రమ అనుబంధం, అనుభవపూర్వక అభ్యాసానికి ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'ఆటోడెస్క్ ఫ్యూజన్ ఇన్‌సైడర్' పేరిట ఒకరోజు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటోడెస్క్ క్వాలిటీ అస్యూరెన్స్ మేనేజర్ సుజయ్ డిసౌజా నేతృత్వంలోని ఎనిమిది మంది పరిశ్రమ నిపుణుల బృందం విద్యార్థులతో ముచ్చటించి, ఆధునిక ఇంజనీరింగ్, ఉత్పత్తి అభివృద్ధి రంగాల్లో వస్తున్న మార్పులు, అవకాశాలపై అవగాహన కల్పించింది. ఆటోడెస్క్ ఉత్పత్తుల పరీక్ష, వినియోగ విధానాలను ప్రదర్శిస్తూ అధునాతన డిజైన్, ఇంజనీరింగ్ సాధనాలపై విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని అందించారు. మూడు వారాల్లో పూర్తి చేయాల్సిన డిజైన్ సవాళ్లను కూడా విద్యార్థులకు అందించారు. డిజైన్, సిమ్యులేషన్, టెక్నికల్ డ్రాయింగ్, రెండరింగ్ అంశాలతో కూడిన ఈ సవాళ్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రాజెక్టు బృందాలు, వ్యక్తిగత ప్రతిభావంతులను ప్రాజెక్టు ఫలితాలు, పనితీరు ఆధారంగా అవార్డులతో సత్కరించనున్నారు. విద్యార్థులు నిజ జీవిత సమస్యలకు ఇంజనీరింగ్ పరిజ్ఞానం, డిజైన్ థింకింగ్, ఆధునిక సాంకేతికతలను ఎలా అన్వయించవచ్చో వివరిస్తూ వినూత్న ఉత్పత్తులను ప్రదర్శించారు. బరువును మోయగల ఎక్సోస్కెలిటన్, స్వయంప్రతిపత్తితో పనిచేసే నదీ శుభ్రత రోబోట్ వంటి భావనలను ప్రదర్శించి తమ సృజనాత్మకతను చాటుకున్నారు. కోర్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ రమేష్ వడ్డి,



మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జయ ప్రకాష్ శ్రీవాస్తవ ఆటోడెస్క్ ప్రతినిధులకు స్వాగతం పలికి సత్కరించారు. మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో పరిశ్రమ--విద్యాసంస్థల భాగస్వామ్యం కీలకమని వారు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధ్యాపకుడు డాక్టర్ వీరప్రతాప్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొని ఆటోడెస్క్ నిపుణులతో సాంకేతిక అంశాలపై చర్చించారు. విద్యార్థులు ఉత్సాహంగా ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పరిశ్రమ పోకడలు, అధునాతన ఇంజనీరింగ్ సాంకేతికతల ఆచరణాత్మక వినియోగంపై అవగాహన పెంచుకునేందుకు ఈ కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగకరమైన వేదికగా నిలిచింది.

# శ్రీ శివాని ఫార్మసీ ఆఫ్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు

## ప్రిన్సిపల్ డాక్టర్ గుమ్మడి శ్రీధర్ బాబు

ప్రకాష్ టైమ్స్ వరంగల్, ఆటోనగర్ రోడ్డు హనుమాన్ విగ్రహం దగ్గరలోని శ్రీ శివాని ఫార్మసీ ఆఫ్ కళాశాల విద్యార్థులు బుధవారం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అట్టహాసంగా ఫ్రెషర్స్ డే వేడుకలతోస్వాగతం పలికారని ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మడి శ్రీధర్ బాబు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కళాశాల చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు, సెక్రటరీ వద్దిరాజు గణేష్ పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ




సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వాగతం పలికారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల డాక్టర్ గుమ్మడి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ ఫార్మసీ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు కొత్త విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులు స్వాగతం పలికారని తెలిపారు. అంతేకాకుండా భవిష్యత్తులో మంచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే నియమ నిబద్ధత చదువుపై ఏకాగ్రత నిర్వహించాలని తెలిపారు. ఈ కళాశాల నుంచి ఎంతోమంది ఫార్మసిస్టులుగా తయారయ్యారని తమ కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో మణికంఠ, అధ్యాపని, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి నిరంతర ప్రక్రియ: రూ.3.85 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రకాష్ టైమ్స్ /వరంగల్ :వరంగల్: ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి అనేది



నిరంతర ప్రక్రియ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు అన్నారు. వరంగల్ 56వ డివిజన్ పరిధిలోని వివేక్ నగర్, జవహర్ కాలనీ, పరిమళ కాలనీ, శ్రీ సాయి నగర్ కాలనీలలో సుమారు రూ.3.85 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రహదారులు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్నతో కలిసి ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ గ్రామాలు, డివిజన్ల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం గోపాలపురం జంక్షన్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు గతంలో కాలనీవాసులు చేసిన విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కందుకూరి పూర్ణచందర్, కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి దూలం సదానందం, చింత రమేష్, మర్రి ప్రభాకర్, దూలం పరమేష్, చింతరెడ్డి రవీందర్ రెడ్డి, నలుబాల దామోదర్, చిప్ప ప్రభాకర్, బోనగాని రాంప్రసాద్, రమేష్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు శనిగరపు అనిత, యూత్ నాయకుడు లావుడియా రవి నాయక్, అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్ స్కూల్ ఆఫ్ లెర్నింగ్‌లో డెంటల్ క్యాంప్


ప్రకాష్ టైమ్స్ /నల్గొండ: నల్గొండ పట్టణంలోని ఎస్ఎస్ స్కూల్ ఆఫ్ లెర్నింగ్ ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్స్ సహకారంతో బుధవారం విద్యార్థులకు డెంటల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కామినేని హాస్పిటల్స్‌కు చెందిన సీనియర్ వైద్యులు విద్యార్థులకు దంతాల ఆరోగ్యం, దంత సమస్యల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా దంతాలను శుభ్రం చేసుకోవడం, ఆహారపు అలవాట్ల విషయంలో జాగ్రత్తలు పాటించడం, దంత సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం వంటి పలు సూచనలు చేశారు. క్యాంప్‌లో భాగంగా విద్యార్థులందరికీ దంత పరీక్షలు నిర్వహించి, వారికి ఉన్న దంత సమస్యలను గుర్తించి తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో కామినేని హాస్పిటల్స్ సీనియర్ డాక్టర్ సుచరిత, పీడో విభాగం హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ డా. రాజేందర్ రెడ్డి, డా. యశ్వంత్, పాఠశాల కరస్పాండెంట్ సత్యశ్రీ తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఇలాంటి వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# ఐకాన్ ఆసుపత్రిపై DMHO ఆకస్మిక తనిఖీలు

## మూడేళ్లలో 191 మంది మృతి.. కేస్‌షీట్లు, బిల్లులు స్వాధీనం

## అధిక బిల్లుల వసూళ్ల ఆరోపణలపై విచారణ.. వైద్యుల అర్హతలు, రిజిస్ట్రేషన్లపైనా ఆరా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఐవీనూ డాక్టర్ కె. రాహుల్ హెచ్చరిక

ప్రకాష్ టైమ్స్ /నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని ఐకాన్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌పై వస్తున్న వరుస ఫిర్యాదులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల దృష్టికి చేరడంతో ఆసుపత్రిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (ఐవీనూ) డాక్టర్ కె. రాహుల్ ఆధ్వర్యంలో అధికారులు ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించి, వైద్య సేవలకు సంబంధించిన రికార్డులు, కేస్‌షీట్లు, బిల్లులు, వైద్యుల అర్హతలు, రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించారు. కొన్ని కీలక పత్రాలు, బిల్లులు, కేస్‌షీట్లను తదుపరి పరిశీలన కోసం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్స విధానం, రోగుల నుంచి వసూలు చేస్తున్న బిల్లులు, ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన నిబంధనలను పాటిస్తున్నారా లేదా అనే అంశాలపై అధికారులు వివరాలు సేకరించారు. ముఖ్యంగా అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో బిల్లులపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మూడు సంవత్సరాల రికార్డులు తెరపైకిఆసుపత్రి రికార్డుల ప్రకారం గత మూడేళ్ల కాలంలో 191 మంది మృతి చెందినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ఈ సంఖ్యపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. మృతి చెందిన ప్రతి రోగికి సంబంధించిన కేస్‌షీట్, ఆసుపత్రిలో అందించిన చికిత్స, రోగి ఆరోగ్య పరిస్థితి, చివరి దశలో అందించిన వైద్య సేవలు తదితర అంశాలను పరిశీలించేందుకు రికార్డులను సేకరించినట్లు వెల్లడించారు. మరణాలకు సహజ కారణాలేనా? చికిత్సలో ఏదైనా లోపం చోటుచేసుకుందా? వైద్యుల నిర్లక్ష్యం ఏమైనా ఉందా? ఆసుపత్రి నిబంధనలను ఉల్లంఘించిందా? అనే కోణాల్లో రికార్డులను పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే కేవలం మరణాల సంఖ్య ఆధారంగా తప్పిదం నిర్ధారించలేమని, కేస్‌షీట్లను పూర్తిగా పరిశీలించిన అనంతరం మాత్రమే వాస్తవ పరిస్థితి వెల్లడవుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఒక్కో కేస్‌షీట్‌పై సమగ్ర పరిశీలనమరణించిన రోగులకు సంబంధించిన కేస్‌షీట్లను అధికారులు సేకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రోగి ఆసుపత్రిలో ఎప్పుడు చేరారు? ఏ అనారోగ్యంతో వచ్చారు? ఏ పరీక్షలు నిర్వహించారు? ఎలాంటి చికిత్స అందించారు? ఏ మందులు ఉపయోగించారు? రోగి పరిస్థితి ఎప్పుడు విషమించింది? చివరకు మరణానికి నమోదైన కారణం ఏమిటి? వంటి అంశాలను రికార్డుల ఆధారంగా పరిశీలించే అవకాశం ఉంది. అవసరమైతే సంబంధిత వైద్యులను, సిబ్బందిని కూడా విచారించి వివరాలు సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు. కేస్‌షీట్ల పరిశీలన అనంతరం ఏవైనా అనుమానాస్పద అంశాలు బయటపడితే తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధిక బిల్లులపై ఫిర్యాదులుఐకాన్ ఆసుపత్రిలో రోగుల నుంచి అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేస్తున్నారనే




ఫిర్యాదులు అధికారులకు అందినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పలు బిల్లులను అధికారులు పరిశీలన కోసం సేకరించారు. రోగికి అందించిన చికిత్సకు సంబంధించిన వివరాలు, మందులు, పరీక్షలు, ఇతర వైద్య సేవలకు సంబంధించిన ఛార్జీలు బిల్లుల్లో సరిగ్గా నమోదు చేశారా లేదా అనే అంశాలను పరిశీలించనున్నారు. రోగులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వసూలు చేసిన మొత్తాలకు సంబంధించి ఆసుపత్రి రికార్డులతో బిల్లులను సరిపోల్చే అవకాశం ఉంది. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలు నిజమా కాదా అన్నది పూర్తిస్థాయి పరిశీలన అనంతరం తేలనుంది. బిల్లులు చెల్లించలేని రోగులపై ఆరాబిల్లులు చెల్లించలేని పరిస్థితుల్లో కొంతమంది రోగులను ప్రభుత్వ ఆసుపత్రులకు తరలిస్తున్నారనే ఆరోపణలపైనా అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఆసుపత్రి నుంచి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలివెళ్లిన రోగుల వివరాలను సేకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒకేసారి ఐదు నుంచి ఆరు బెడ్లు ఈ ఆసుపత్రి నుంచి తరలివచ్చే రోగులతోనే ఉంటున్నాయనే ఫిర్యాదులపై కూడా అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అయితే ఈ ఆరోపణల వాస్తవ పరిస్థితి ఏమిటనేది సంబంధిత రికార్డులు, రోగుల వివరాల పరిశీలన అనంతరం స్పష్టమయ్యే అవకాశం ఉంది. వైద్యుల అర్హతలపై ప్రత్యేక తనిఖీఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల విద్యార్హతలు, వైద్య రిజిస్ట్రేషన్ వివరాలను కూడా అధికారులు పరిశీలించారు. ఆసుపత్రికి గతంలో అనుమతులు మంజూరు చేసిన సమయంలో పనిచేసిన కొంతమంది వైద్యులు ప్రస్తుతం అక్కడ పనిచేయడం లేదని అధికారులు గుర్తించినట్లు తెలిపారు. వారి స్థానంలో ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యుల వివరాలు, విద్యార్హతలు, సర్టిఫికెట్లు, సంబంధిత రిజిస్ట్రేషన్ వివరాలు ఆసుపత్రి రికార్డుల్లో తప్పనిసరిగా ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. వైద్య సేవలు అందించే ప్రతి వైద్యుడు నిబంధనలకు అనుగుణంగా అర్హతలు, చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ కలిగి ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల వైద్యులపైనా ఆరాఆసుపత్రిలో ఇతర రాష్ట్రాలకు చెందిన కొంతమంది వైద్యులు ప్రాక్టీస్ చేస్తున్నారనే సమాచారంపైనా అధికారులు దృష్టి సారించారు. ఆసుపత్రికి విజిట్ చేస్తున్న వైద్యుల వివరాలు, వారు అందిస్తున్న సేవలు, వారి విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ వివరాలను కూడా అధికారులు సేకరిస్తున్నారు. ఆసుపత్రిలో పూర్తికాలం పనిచేసే వైద్యులు, విజిటింగ్ కన్సల్టెంట్ల వివరాలను వేర్వేరుగా పరిశీలించే అవకాశం ఉంది. వైద్య సేవలు అందిస్తున్న ప్రతి వైద్యుడికి సంబంధించిన ధ్రువపత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు అందుబాటులో ఉండాలని అధికారులు సూచించారు. ఆసుపత్రి నిర్వహణపై కూడా పరిశీలనతనిఖీల సందర్భంగా అధికారులు ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించినట్లు తెలిపారు. రోగుల చేరిక నుంచి డిశ్చార్జి వరకు నిర్వహిస్తున్న రికార్డులు, చికిత్స వివరాలు, బిల్లింగ్ విధానం, వైద్య సిబ్బంది వివరాలు తదితర అంశాలను పరిశీలనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఆసుపత్రి నిర్వహణలో ప్రభుత్వ మార్గదర్శకాలు, వైద్య రంగానికి సంబంధించిన నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. రికార్డుల్లో ఏవైనా వ్యత్యాసాలు కనిపిస్తే వాటిపై వివరణ కోరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఫిర్యాదులపై అధికారులు సీరియస్ఐకాన్ ఆసుపత్రికి సంబంధించి వరుసగా వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ఈ ఆకస్మిక తనిఖీలను నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రోగుల నుంచి అధిక బిల్లులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు, ప్రభుత్వ ఆసుపత్రులకు రోగులను తరలిస్తున్నారనే ఫిర్యాదులు, వైద్యుల అర్హతలు, గత మూడేళ్లలో నమోదైన మరణాల వివరాలు ఇలా పలు అంశాలు ఒకేసారి విచారణ పరిధిలోకి వచ్చాయి. అధికారులు సేకరించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వాస్తవ పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అవసరమైతే మరిన్ని రికార్డులను కూడా ఆసుపత్రి యాజమాన్యం నుంచి తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలుప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఐవీనూ డాక్టర్ కె. రాహుల్ స్పష్టం చేశారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు, బిల్లింగ్ విధానంలో పారదర్శకత పాటించాలని సూచించారు. వైద్యుల అర్హతలు, రిజిస్ట్రేషన్, ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే ఆసుపత్రిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతానికి ఆరోపణలు, ఫిర్యాదుల ఆధారంగానే విచారణ కొనసాగుతోందని, అధికారులు సేకరించిన రికార్డుల పూర్తిస్థాయి పరిశీలన అనంతరం మాత్రమే బాధ్యతను నిర్ధారించే అవకా శం ఉంటుందని తెలిపారు. నివేదిక తర్వాతే తదుపరి చర్యలుఆకస్మిక తనిఖీలలో సేకరించిన కేస్‌షీట్లు, బిల్లులు, వైద్యుల అర్హతలు, రిజిస్ట్రేషన్ వివరాలు, ఇతర రికార్డులను అధికారులు పరిశీలించనున్నారు. గత మూడేళ్లలో నమోదైన 191 మరణాలకు సంబంధించిన కేసులను కూడా విడివిడిగా పరిశీలించే అవకాశం ఉంది. పూర్తి స్థాయి విచారణ అనంతరం ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు లేదా తప్పిదాలు నిర్ధారణ అయితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు, ఆసుపత్రి యాజమాన్యం నుంచి కూడా సంబంధిత అంశాలపై వివరణ తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.






# అల్లరి నరేష్ తో రంభ ఊర్వశి మేనక

- నవ్వుల విందుకు రెడీ
- సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు..
- విడుదలైన టీజర్ !

కొంతకాలంగా సీరియస్ కథల్లో నటిస్తున్న అల్లరి నరేష్ మరోసారి కామెడీ జానర్‌లోకి వచ్చారు. ఆయన హీరోగా నటించిన 'రంభ ఊర్వశి మేనక' చిత్రం సెప్టెంబర్ 4న విడుదల కానుంది. తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచింది.కథ మొత్తం ఓ మాయా పుస్తకం చుట్టూ తిరుగుతుంది. ఆ పుస్తకం ద్వారా ఇంద్రలోకానికి ద్వారాలు తెరుచుకుని రంభ, ఊర్వశి, మేనకలు భూమిపైకి వస్తారని నరేష్ నమ్ముతాడు. దేవకన్యల రాకతో గ్రామంలో జరిగే పరిణామాలే కథగా తెలుస్తోంది.చాలాకాలం తర్వాత అల్లరి నరేష్ పూర్తిస్థాయి కామెడీ పాత్రలో కనిపించనుండగా.. వెన్నెల కిషోర్ ఇంద్రుడి పాత్రలో నవ్వులు పంచనున్నారు. సురభి కథానాయికగా నటిస్తుండగా, రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్‌లు దేవకన్యల పాత్రల్లో కనిపించనున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ నిర్మిస్తున్న ఈ ఫాంటసీ కామెడీ చిత్రం సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# చిరు సినిమాకు.. టైటిల్ ఫిక్స్!

## 'కదిరి'గా మెగాస్టార్ మాస్ ట్రీట్!

మెగాస్టార్ చిరంజీవి తన 158వ సినిమా టైటిల్‌ను స్వయంగా లీక్ చేశారు. వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' సక్సెస్ మీట్‌లో పాల్గొన్న చిరంజీవి.. దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో తెరకెక్కుతున్న తన కొత్త చిత్రానికి 'కదిరి' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు వెల్లడించారు. దీంతో #ChiruLeaks మరోసారి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది.సంగీత దర్శకుడు తమన్ వద్దని వారిస్తున్నప్పటికీ చిరంజీవి సరదాగా సినిమా టైటిల్‌ను బయటపెట్టారు. అంతేకాదు, తన పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22న 'కదిరి' టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి–బాబీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రియమణి కథానాయికగా నటిస్తుండగా.. రచితా రామ్, నివేదా పేతురాజ్, అనశ్వర రాజన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.కేవీఎన్‌ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

# రుక్మిణి వసంత్‌కు మరో క్రేజీ ఆఫర్..

- మాలీవుడ్ ఎంట్రీకి రెడీ
- నివిన్ పౌలీ సరసన హీరోయిన్‌గా ఛాన్స్
- 'కాంతారా చాప్టర్ వన్'తో నటిగా ప్రత్యేక గుర్తింపు
- ఎన్టీఆర్ 'డ్రాగన్'లోనూ కీలక పాత్ర

ఒక్క సినిమాతో సక్సెస్ అందుకున్న హీరోయిన్లకు వరుస అవకాశాలు రావడం సాధారణమే. ప్రస్తుతం యువ కథానాయిక రుక్మిణి వసంత్ విషయంలోనూ ఇదే జరుగుతోంది. 'సప్త సాగరాలు దాచే ఎల్లో'తో వెండితెరకు పరిచయమైన ఆమె.. 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'తో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు. అనంతరం శివకార్తికేయన్ సరసన 'మదరాసి'లో నటించారు.'కాంతారా చాప్టర్ వన్'తో రుక్మిణికి మరింత గుర్తింపు వచ్చింది. క్లైమాక్స్‌లో ప్రతికూల ఛాయలున్న పాత్రలో ఆమె నటనకు ప్రశంసలు దక్కాయి. ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న 'డ్రాగన్'లోనూ కథానాయికగా నటిస్తున్నారు.తాజాగా మలయాళ స్టార్ హీరో నివిన్ పౌలీ సరసన నటించే అవకాశం రుక్మిణికి దక్కింది. షూటింగ్ ప్రారంభమైన సందర్భంగా క్లాప్‌బోర్డు పట్టుకున్న ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేయడంతో మాలీవుడ్ ఎంట్రీ అధికారికమైంది. టాలీవుడ్, కోలీవుడ్ తర్వాత మలయాళంలోనూ వరుస అవకాశాలు అందుకుంటున్న రుక్మిణి.. అక్కడ ఎలాంటి విజయాన్ని అందుకుంటారో చూడాలి.




# డెనిమ్ డ్రెస్‌లో దివి

## స్టైలీష్‌గా అందాల ఆరబోత

టాలీవుడ్ నటి దివి తన స్టైలిష్ లుక్‌తో మరోసారి ఆకట్టుకుంది. నల్లటి లేస్ క్రాప్ టాప్‌పై ట్రెండీ డెనిమ్ జాకెట్, మ్యాచింగ్ డెనిమ్ స్కర్ట్ ధరించి, స్టేట్‌మెంట్ సన్‌గ్లాసెస్, లేయర్డ్ నెక్లెస్‌లు, బ్రేస్‌లెట్‌లతో ఆమె ఫ్యాషన్ లుక్‌ను పూర్తి చేసింది. గ్రాఫిటీ గోడ ముందు చేతులు పైకెత్తి, గాలికి ఎగురుతున్న జుట్టుతో ఆమె ఇచ్చిన పోజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
ఈ ఫొటోలు ఆమె ఆత్మవిశ్వాసాన్ని, ఫ్యాషన్‌పై ఉన్న ఆసక్తిని ప్రతిబింబిస్తూ సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.



# ఎన్టీఆర్‌కు భుజానికి శస్త్రచికిత్స..

- కిమ్స్‌లో సర్జరీ.. ఎనిమిది వారాల విశ్రాంతి
- 'డ్రాగన్'కు మరో బ్రేక్?
- షూటింగ్ మరింత ఆలస్యం అయ్యే అవకాశం

స్టార్ హీరో ఎన్టీఆర్‌కు భుజానికి శస్త్రచికిత్స జరగనుంది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్న ఆయనకు ఇటీవల భుజానికి గాయం కావడంతో వైద్యులు సర్జరీ చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో బుధవారం నిపుణులైన వైద్యుల బృందం శస్త్రచికిత్స నిర్వహించనుంది. సర్జరీ అనంతరం వైద్యుల సూచన మేరకు ఎన్టీఆర్ విశ్రాంతి తీసుకోనున్నారు. ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు వెల్లడిస్తామని ఆయన టీమ్ తెలిపింది.



**ఎనిమిది వారాల విశ్రాంతి**

రెండు వారాల క్రితమే ఎన్టీఆర్ భుజానికి గాయమైన విషయం తెలిసిందే. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న ఆయన.. సర్జరీ అనంతరం సుమారు ఎనిమిది వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో అభిమానులు ఆందోళన చెందుతున్నప్పటికీ.. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

**'డ్రాగన్' షూటింగ్‌కు బ్రేక్?**

ఎన్టీఆర్ గాయంతో 'డ్రాగన్' షూటింగ్‌కు బ్రేక్ పడే అవకాశం ఉంది. సర్జరీ తర్వాత ఎనిమిది వారాల విశ్రాంతి అవసరం కావడంతో షూటింగ్ షెడ్యూల్ వాయిదా పడే అవకాశముంది. ఇప్పటికే పలుమార్లు వాయిదాపడిన ఈ ప్రాజెక్ట్ మరింత ఆలస్యం కావచ్చనే ప్రచారం జరుగుతోంది. అయితే ఎన్టీఆర్ పూర్తిగా కోలుకున్న తర్వాతే షూటింగ్‌లో పాల్గొననున్నారు. దీంతో సినిమా విడుదల తేదీపై ప్రభావం ఉంటుందా అనేది ఆసక్తికరంగా మారింది.

Printed, Published & Owned by VANAMALA RAMAKRISHNA Published from Vanamala Publications, H.No. 1-29 Village : Elikatte,Mand:Chityal, Dist : Nalgonda.Telangana Sate. Pin : 508114 and Printed at Vanamala Printers, H.No. 1-29 Village : Elikatte, Mand:Chityal, Dist : Nalgonda. Dist : Nalgonda. Pin : 508001. Telangana State. Editor : VANAMALA RAMAKRISHNA Cell : 8688262225. RNI No : TELTEL/2021/90969